క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల తనిఖీ



విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని పోలింగ్ కేంద్రాలను మండల తహసీల్దార్, సహాయ ఎన్నికల నమోదు అధికారి కె.లక్ష్మి శుక్రవారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సదుపాయం, ఫర్నిచర్, దివ్యాంగులకు కల్పించిన ర్యాంపు నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో గన్నవరం నియోజకవర్గానికి సంబంధించి నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో 82 పోలింగ్ కేంద్రాలున్నాయని, దాదాపు 80 వేల పైచిలుకు ఓటర్లున్నారని తెలిపారు. ఓట్లు నమోదు ప్రక్రియ నిరంతరం జరిగేది కాబట్టి మార్పులు, చేర్పులు చేసుకోవచ్చని చెప్పారు. జనవరి 22వ తేదీన ఓటర్ల తుది జాబితా వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పెదపులిపాకలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం శుక్రవారం జరిగింది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ఆయుష్, ఆయుర్వేద శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి, డాక్టర్ ఎన్ఆర్ఎస్ ఆయుర్వేద కాలేజీ సంయుక్తంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో 139 మందికి బీపీ, షుగర్ తదితర వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గంటూరు శ్రీనివాసాచౌదరి, ఈఓ పద్మావతిదేవి, డాక్టర్ పి.రాజరాజేశ్వరి, డాక్టర్ పి.కృష్ణవేణి, డాక్టర్ పద్మ, డాక్టర్ నీలిమ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

7న వీకేఆర్ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో 2024 జనవరి 7వ తేదీన పూర్వ విద్యార్థులు, అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీఎల్ ప్రసాద్, ఎన్‌బీఎం మురళీకృష్ణ తెలిపారు. కళాశాలలో శుక్రవారం వారు మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులను భాగస్వాములు చేసేందుకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమ్మేళనంలో ప్రస్తుత, పూర్వ అధ్యాపకులు, అన్ని బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు హాజరుకావాలని కోరారు. కమిటీ ప్రతినిధి రాంబాబు పాల్గొన్నారు.

రూ. 90 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్ల రికవరీ



కోనేరుసెంటర్: జిల్లాలో చోరీకి గురైన సెల్‌ఫోన్లను పోలీసులు పెద్ద సంఖ్యలో రికవరీ చేశారు. రికవరీ చేసిన ఫోన్లను బాధితులకు అప్పగించనున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ పి. జాషువా శుక్ర వారం పోలీసు కార్యాలయంలో రికవరీ చేసిన సెల్‌ఫోన్లను ప్రదర్శించి మాట్లాడారు. 2023 జన వరి నుంచి వివిధ రకాలుగా సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న అనేకమంది ఫిర్యాదు చేశారని చెప్పారు. మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టం (ఎంఎంటీఎస్)ను వినియోగించి సుమారు రూ. 90 లక్షల విలువ గల 421 సెల్‌ఫోన్లను రికవరీ చేశామని చెప్పారు. ఇదే సిస్టంతో గతంలో 50 లక్షల విలువ చేసే 252 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు సెల్: 94906 17573 వాట్సాప్ నెంబర్‌కు హాయ్ అని లేదా హెల్ప్ అని మెసేజ్ పంపి అడిగిన సమా చారం ఇవ్వాలని చెప్పారు. ఏఆర్ ఏఎస్పీ ప్రసాద్, బందరు డీఎస్పీ మాధవరెడ్డి, సీసీఎస్ డీఎస్పీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆదివారం కూడా పన్నులు చెల్లించవచ్చు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థకు నగరవాసులు కట్టాల్సిన పన్నులను ఆదివారం కూడా చెల్లించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను, తాగునీరు, డ్రైనేజీ పన్నులను డిసెంబర్ 31, 2023 లోగా చెల్లించాలని, ఈ మేరకు నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో ఉన్న పన్ను చెల్లింపు క్యాష్ కౌంటర్లు ఆదివారం కూడా పని చేస్తాయని వివరించారు. ఆయా ప్రాంతాల్లోని క్యాష్ కౌంటర్లు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయని తెలిపారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

ఉంగుటూరు: మండల వ్యాప్తంగా ఉన్న 16 గ్రామ సచివాలయాల్లో 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. మండలంలో ఎంపిక చేసిన క్రీడా మైదానాల్లో కబడ్డీ, ఖోఖో, షటిల్, క్రికెట్, బ్యాడ్మింటిన్ పోటీలకు షెడ్యూల్ ఇచ్చారు. ఇందుపల్లిలో జరిగిన ఆటల పోటీలను ఎంపీడీఓ శేషగిరిరావు పరిశీలించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ అమీర్‌బాషా, సచివాలయ సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎంలు, పీఈటీలు పాల్గొన్నారు.

బాపులపాడులో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో భాగంగా బాపులపాడులోని మూడు గ్రామ సచివాలయాల పరిధిలోని జట్ల మధ్య కబడ్డీ పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. స్థానిక నూజివీడు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో బాలురు, బాలికల జట్లకు కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవో-2 సురేష్ కుమార్ తిలకించారు. విద్యార్థులు, యువతలో శారీరక, మానసిక వికాసానికి ఆటల పోటీలు ఎంతగానో ఉపకరిస్తాయని ఆయన తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం తోట వెంకట నాగేశ్వరరావు, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పామర్తి వెంకటేశ్వరరావు, పలువురు పీఈటీలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గన్నవరంలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

గన్నవరంలో..

గన్నవరం: స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎంపీడీఓ ఇ.సత్యకుమార్ పర్యవేక్షణలో వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు. గ్రామ సచివాలయం-2, 3 పరిధిలోని క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కేసరపల్లిలో క్రికెట్, ఖోఖో పోటీలు జరిగినట్లు నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త డి.నాగరాజు తెలిపారు. దావాజిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న సచివాలయ స్థాయి పోటీలు ముగిసినట్లు ఆయన పేర్కొన్నారు.

వణుకూరులో..

పెనమలూరు: వణుకూరు గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కబడ్డీ పోటీలను గ్రామ ఉప సర్పంచ్ గద్దల రాజా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పోటీలతో క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారని చెప్పారు. క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కాగా మండల పరిధిలో 13 జట్లు కబడ్డీ పోటీల్లో పాల్గొన్నాయి. ఎంపీడీఓ సునీతాశర్మ, ఏఓ లోయ శివశంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో కబడ్డీ పోటీలు



ఇందుపల్లిలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

నేడు కంకిపాడు మండల పరిషత్ సమావేశం

కంకిపాడు: కంకిపాడు మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం శనివారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.అనూష శుక్రవారం తెలిపారు. ఆమె వివరాలు తెలుపుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందన్నారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

విద్యార్థుల్లో ప్రేరణ కలిగేలా బోధించాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థుల్లో ప్రేరణ కలిగించే విధంగా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధించాలని ఎంఈవో శ్రీరామ్ బాలసింగ్ అన్నారు. స్థానిక వేలేరు జెడ్పీ హైస్కూల్‌లో గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ తరగతులను శుక్రవారం నిర్వహించారు. ఎంఈఓ శ్రీరామ్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు నూతన బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు అనుసరించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి వచ్చిన దృశ్య, శ్రవణ ఉపకరణాలు, డిజిటల్ తరగతులు, విద్యార్థుల ట్యాబ్‌లను ఉపయోగించి మరింత ప్రభావితంగా పాఠ్యాంశాలను బోధించవచ్చని తెలిపారు. ఎంఈఓ-2 బి.సురేష్ కుమార్ మాట్లాడుతూ ఎఫ్ఎల్ఎన్ విధానం, పరీక్షపై చర్చ వంటి అంశాలను ఉపాధ్యాయులకు వివరించారు. వేలేరు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కొమ్మా విజయ్, కార్యదర్శి దారపురెడ్డి భాస్కరరావు, ప్రభుత్వ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో సావరగూడెం



గ్రామ సచివాలయం, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ల సముదాయం



సావరగూడెంలో పూర్తి అయిన గృహ నిర్మాణాలు

పల్లె నుదుటిన ప్రభుత్వ కార్యాలయాలు

గన్నవరం రూరల్: గడచిన నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామ స్వరాజ్యం వచ్చినట్లు అయ్యింది. మైనర్ పంచాయతీల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో పల్లె నుదుటిన ప్రభుత్వ కార్యాలయాలు సిందూరాలుగా మెరుస్తున్నాయి. సంక్షేమం, అభివృద్ధి కళ్ల ముందు సాక్షాత్కరించింది.

అభివృద్ధి బాటలో సావరగూడెం..

సావరగూడెంలో ప్రజలందరికీ సౌకర్యంగా ఉండేలా ఒకే ప్రాంగణంలో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ నిర్మించారు. వీటి నిర్మాణంతో సావరగూడెం, జక్కులనెక్కలం గ్రామాల ప్రజలకు సేవలు ఎంతో సులభం అయ్యాయి. అలాగే ఇప్పటి వరకు సావరగూడెం, జక్కులనెక్కలం గ్రామాల్లోని ప్రజలకు ప్రత్యక్ష, పరోక్ష పద్ధతి ద్వారా రూ. 17.45 కోట్లను ప్రభుత్వం అందజేసింది. అర్హులైన వారందరికీ పారదర్శంగా వివక్షకు తావు లేకుండా లబ్ధి చేకూరింది.

రూ.87 లక్షలతో భవనాల నిర్మాణం..

గ్రామ సచివాలయాన్ని రూ. 43.6లక్షలతో, ఆర్బీకేను రూ. 23.94లక్షలతో, వెల్‌నెస్ సెంటర్‌ను రూ. 20.08 లక్షలతో నిర్మించారు. ఇదే ఆవరణలో వెటర్నరీ వైద్య సేవలను సైతం ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీ పాలకులు ఆలోచన చేస్తున్నారు. అలాగే సావరగూడెంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనాలకు రూ. 10.45 లక్షలు వెచ్చించి కార్పొరేట్ స్థాయికి మించి అభివృద్ధి చేశారు.

125 గృహ నిర్మాణాలు..

అర్హులైన 125 మంది పేదలకు ఇంటి స్థలాలు అందించడంతో పాటు వారికి సొంతంగా ఇంటి నిర్మాణాలు చేసుకునే విధంగా లోన్లు సైతం ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో 60 ఇళ్లు అందంగా డిజైన్‌లతో అలరారుతున్నాయి. మిగిలిన వారు వివిధ దశల్లో నిర్మాణం చేస్తున్నారు. పేదల సొంతింటి కలను నిజం చేసినందుకు గానూ ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

గ్రామస్థాయిలో సేవలు



సంక్షేమం, అభివృద్ధిలో ప్రభుత్వం ఎంతో మేలు చేసింది. ప్రజలకు గ్రామస్థాయిలో సేవలు అందించింది. ఊళ్లకు ఊళ్లు నిర్మించి పేదలకు సొంతింటి కల నిజం చేసింది. చరిత్రలో ఇంత మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన ప్రభుత్వం లేదు.

– రాచమళ్ళ యల్లారావు, గ్రామస్తుడు

గడప గడపకు సంక్షేమం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో పెన్షన్లు, రేషన్లు గడప గడపకు చేరుతున్నాయి. ప్రభుత్వ సహకారంతో గ్రామంలో అభివృద్ధి జరిగింది. సచివాలయాల ఏర్పాటుతో సేవలన్నీ ప్రజలకు గ్రామంలోనే లభించడం ఎంతో ఆనందదాయకం.

– అట్ల నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్

నూరుశాతం ఉత్తీర్ణులు కావాలి

నున్న(విజయవాడరూరల్): జగనన్న స్ఫూర్తి ఉచిత స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకుని 10వ తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణులు కావాలని జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు ఆకాంక్షించారు. నున్న జిల్లాపరిషత్ హైస్కూల్‌లో జగనన్న స్ఫూర్తి ఉచిత స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులందరూ ఉత్తీర్ణులై పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా మెటీరియల్ అందజేసిన ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారికారాముకు ధన్యవాదాలు తెలియజేశారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.



ఉచిత స్టడీ మెటీరియల్స్ అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, ఉపాధ్యాయులు

విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి

డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ

కంకిపాడు: విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. మండలంలోని కుందేరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం స్నిగ్ధ పరిశీలించారు. నాడు-నేడు, విద్యాభివృద్ధి కార్యక్రమాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులతో చర్చించారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ పాలనలో ప్రభుత్వ విద్య నిర్లక్ష్యానికి గురైందని చదువు కార్పొరేట్ వ్యాపారంగా మారిందని అన్నారు. ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందక పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు చదువులకు దూరమయ్యారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు వైభవం తెచ్చారని వివరించారు. మౌలిక వసతుల కల్పన, విద్యా సంస్కరణలతో విద్యార్థుల ఉన్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులకు స్వీట్లు పంపిణీ చేశారు.



కుందేరులో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ

ఇంద్రకీలాద్రిపై రద్దీ సాధారణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం రద్దీ సాధారణంగా కనిపించింది. ఉదయం 6 గంటల నుంచి ఓ మోస్తరుగా ఉన్న రద్దీ మధ్యాహ్నం కాస్త పెరిగింది. అమ్మవారికి మహా నివేదన సమర్పించడానికి అరగంట అన్ని దర్శనాలు నిలిపివేశారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు రద్దీ కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో ఎన్.రమేష్‌బాబులు క్యూలైన్లను పర్యవేక్షించారు.

నేడు కానుకల లెక్కింపు

శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్లకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు, మొక్కుబడులను శనివారం లెక్కించనున్నారు. మహా మండపం ఆరో అంతస్తులో కానుకల లెక్కింపు జరగనున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

రమణ మహర్షి బోధనలు అనుసరణీయం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రమణ మహర్షి బోధనలు అనుసరణీయమని ఆధ్యాత్మిక ప్రసంగీకుడు బ్రహ్మశ్రీ పసుమర్తి కామేశ్వరశర్మ అన్నారు. రమణ మహర్షి సేవా సంస్థ ఆధ్వర్యంలో రమణుల జయంతి ఉత్సవాన్ని పాతబస్తీలోని కుసుమహరనాథ మందిరంలో వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా జరుగుతున్న ఉత్సవం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రసంగం జరిగింది. రమణులకు ప్ర త్యేక పూజలను నిర్వహించారు. రెండు రోజుల పాటు విశేష జ్యోతులు వెలిగించి పూజలను కొనసాగించారు. సమితి సభ్యులు కోటేశ్వరరావు, రామకృష్ణ, మారెళ్ల శ్రీనివాసు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



సంక్రాంతికి పేరంటాలమ్మ ఆలయం ముస్తాబు

- జనవరి 3న పుట్టింటికి చేరుకోనున్న పేరంటాలమ్మ
- తిరిగి 12న ఆలయ ప్రవేశం
- 13 నుంచి ఉత్సవాలు ప్రారంభం

రామవరప్పాడు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం సంక్రాంతి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ప్రతీ సంవత్సరం అత్యంత వైభవంగా నిర్వహించే ఉత్సవాలను ఈ సంవత్సరం కూడా ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయంలో ఉత్సవాల నిర్వహణకు పోలీసు, రెవెన్యూ, హెల్త్ శాఖలతో పాటు ఇరు గ్రామాల(రామవరప్పాడు, ప్రసాదంపాడు) పెద్దలతో గ్రామసభ నిర్వహించి సలహాలు, సూచనలు తీసుకున్నారు. జనవరి 3వ తేదీన పేరంటాలమ్మను రాజులబజారులోని అమ్మవారి పుట్టింటికి ఊరేగింపుగా తీసుకెళ్తారు. తిరిగి 12న సాయంత్రం పుట్టింటి నుంచి మేళ తాళాలతో ఆలయానికి చేరుకుంటారు. 13 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు, తాగునీటి వసతి, మొక్కుబడులు నిర్వహించుకునేందుకు వీలుగా ఆలయ ఈఓ పి.లోకేశ్వరి, చైర్మన్ బోయిన భానుప్రదీప్‌లు సౌకర్యాల కల్పనపై ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ చరిత్ర

గ్రామంలోని వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయానికి 150 ఏళ్ల చరిత్ర ఉంది. క్లొపల్లి భూపాళ్లరాజు, వెంకటసుబ్బమ్మ దంపతుల కుమార్తె వెంకమ్మ పేరంటాలమ్మ. పేరంటాలమ్మకు చిన్నతనంలోనే బాల్య వివాహమైంది. కానీ వివాహమైన కొద్ది రోజులకే పేరంటాలమ్మ మరణించింది. తన తండ్రి భూపాళ్లరాజుకు ఒక రోజు ఆమె ప్రత్యక్షమై తాను సూచించిన చోట పసుపు మూట కనబడుతుందని అక్కడే తనకు గుడి కట్టించాలని కోరింది. దీంతో ప్రస్తుతం ఉన్న ఆలయ ప్రాంగణంలో పసుపుమూట కనపడటంతో భూపాళ్లరాజు పెంకుటిళ్లతో ఆలయాన్ని కట్టించారు.

భూపాళ్లరాజు మరణాంతరం ఆయన కుమారుడు క్లొపల్లి బాపిరాజు ఆలయాన్ని పునఃనిర్మించారు. భూపాళ్లరాజు హయాంలోనే క్లొపల్లి సూర్యనారాయణ రాజు అర్చకత్వంలో అమ్మవారికి పూజలు జరిగేవి. 1989 నుంచి మాజీ సర్పంచ్ దాకారపు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు 10 సంవత్సరాలు పాటు జరిగాయి. అనంతరం వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం దేవాదాయశాఖ ఆధీనంలోకి వెళ్లడంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఐదు రోజులపాటు సందడి

ఐదు రోజుల పాటు నిరాటకంగా జరిగే అమ్మవారి గ్రామోత్సవంలో కుటుంబ సమేతంగా భక్తులు పాల్గొంటారు. జాతరను పురస్కరించుకుని ఒక పక్క ఆట వస్తువులతో కూడిన దుకాణాలు, మరో పక్క జెయింట్ వీల్, కొలంబస్, వీల్‌చైర్, మ్యూజిక్ చైర్ల వంటి వినోదాలు పంచే ఎగ్జిబిషన్‌తో సందడి నెలకుంటుంది.



ఉత్సవాలకు సిద్ధమైన పేరంటాలమ్మ ఆలయం

ఘనంగా ఉత్సవాలు



ప్రతీ సంవత్సరం అత్యంత వైభవంగా నిర్వహించే సంక్రాంతి ఉత్సవాలను ఈ సంవత్సరం కూడా ఘనంగా నిర్వహించనున్నాము. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేస్తున్నాము. ఇరు గ్రామ పెద్దలు, దాతల సహకారంతో ప్రసాదాల వితరణ, ఆలయ అలంకరణ, అన్నసంతర్పణ కార్యక్రమాలను నిర్వహిస్తాము. జాతర సందర్భంగా అమ్మవారి గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాము.

– బోయిన భానుప్రదీప్, ఆలయ చైర్మన్

వైన్ షాప్ సూపర్‌వైజర్ ఆత్మహత్య



ఉంగుటూరు: నందమూరు వైన్‌షాప్ సూపర్‌వైజర్ తన ఇంటిలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మానికొండకు చెందిన విశ్వనాథభుల్లి రత్నాకర్(24) నందమూరు వైన్ షాపులో గత కొంత కాలంగా సూపర్ వైజర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం నందమూరు వైన్ షాపులో విజిలెన్స్ అధికారులు రికార్డులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో సుమారు రూ. 50 వేలు తక్కువ వచ్చినట్లు గుర్తించారు. అనంతరం అధికారులు నగదు రికవరీ చేయాలని రిపోర్టు రాసి వెళ్లారు. వారు వెళ్లిన తర్వాత కొంత సేపటికి రత్నాకర్ ఇప్పుడే ఇంటికి వెళ్లి వస్తానని తోటి సిబ్బందికి చెప్పి వెళ్లాడు. రత్నాకర్ కోసం స్నేహితులు ఇంటికి వెళ్లగా బాత్‌రూమ్‌లో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఆసుపత్రికి తరలించే మార్గంలో మృతి చెందాడు. రత్నాకర్ అవివాహితుడు. ఉంగుటూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తన చావుకు ఎవరూ బాధ్యులు కాదని మృతుడి జేబులో ఉత్తరం ఉన్నట్లు బంధువులు గుర్తించి పోలీసులకు తెలిపారు. గతంలో కూడా తనిఖీలో నగదులో వ్యత్యాసాలు రావడంతో అప్పు చేసి నగదు చెల్లించినట్లు స్థానికులు చెబుతున్నారు.